క్లుప్తంగా

కన్యకాపరమేశ్వరికి జన్మనక్షత్ర పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజార్లు దర్భి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్‌లు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోత్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వర రావు, కమిటీ సభ్యులతో పాటూ ఆర్యవైశ్య సంఘం నాయకులు అయితా శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరు గురించి సంబంధిత అధికారులు సమావేశంలో సభ్యులకు వివరించారు. జయంతి రామాపురం గ్రామంలో మంచినీటి సమస్య గురించి సర్పంచ్ వై.వెంకటేశ్వర్లు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో, శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.మరియమ్మ, ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ షేక్ జిలానీబాషా, ఐసీడీఎస్ సీడీపీవో బి.అరుణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వారాహీ నవరాత్రులు



శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవాలయంలో వారాహీ మాతా నవరాత్రుల వేడుకలు ఘనంగా జరుగుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాల నరసింహా రావు శుక్రవారం తెలిపారు. 7వ రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూలమాలల వేసి మహిళ భక్తులచే అమ్మవారికి కుంకుమాభిషేకం, అభిషేకాలు అర్చనలు విశేష పూజలు ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ సారథ్యంలో వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, కె.సాంబశివరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపిక

రొంపిచర్ల: మండలంలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కోర్సుకు ఎంపికైనట్లు ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ట్రిపుల్ ఐటీ కోర్సుకు ఎంపికై న ఐదుగురిలో ముగ్గురు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్, మిగిలిన ఇద్దరిలో ఒక్కరు శ్రీకాకుళం, మరొకరు ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారన్నారు. మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో గత విద్యాసంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 580కి పైగా మార్కులు సాధించిన డి.దీపిక, ఎం.భవ్యశ్రీ, సి.వెంకట అవినాష్‌లు నూజివీడు క్యాంపస్‌కు ఎంపికయ్యారన్నారు. అదే విధంగా మండలంలో వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ ఆయాష పర్వీన్ శ్రీకాకుళం క్యాంపస్, బాణావత్ అనీల్ నాయక్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారన్నారు. ట్రిపుల్ ఐటీ కోర్సుకు ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్‌సీసీకి 52 మంది ఎంపిక

నాదెండ్ల: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేహదారుఢ్యం, దేశ ఉత్తమ పౌరులుగా ఎదగొచ్చని హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 25 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు రన్నింగ్, జంపింగ్, వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం 52 మందిని ఎంపిక చేసి బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. దేశభక్తి, త్యాగనిరతి అలవరతాయన్నారు. ఎంపిక ప్రక్రియలో సుబేదార్‌లు ఆర్ దేవరాజ్, హవల్దార్ జి.కృష్ణ, కల్యాణ్, శ్రీనివాసరావు, షేక్ సైదా, స్థానిక ఎన్‌సీసీ అధికారి షేక్ మహమ్మద్ రసూల్, పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు రత్నరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

- హెచ్చరించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు
- ఆక్రమణలపై పంచాయతీ సెక్రటరీపై మండిపాటు



వినియోగదారులకు బియ్యం, కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

రొంపిచర్ల: ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులను ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు హెచ్చరించారు. మండలంలోని కొత్తపల్లి, నల్లగార్లపాడు గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నల్లగార్లపాడు గ్రామంలోని మంచినీటి ట్యాంక్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చెరువు పరిసరాలను పరిశీలించారు. చెరువులో విపరీతంగా పెరిగిన తూటుకాడ, మంచినీటి చెరువు ఆక్రమణలుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలను చూస్తూ ఊరుకోవటంపై పంచాయతీ సెక్రటరీపై మండిపడ్డారు. తక్షణమే ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి చెరువు తక్షణమే బాగుచేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్న కృష్ణవేణి విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, ఎండీవో లక్ష్మీకుమారి, హెచ్‌ఎం మాధవి, దామచర్ల శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లు సద్వినియోగించుకోవాలి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరకు ఇస్తున్న బియ్యం, కందిపప్పు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక శివునిబొమ్మ సెంటర్ వద్ద శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా కొంతమంది వినియోగదారులకు ప్రభుత్వ రేట్ల ప్రకారం బియ్యం, కందిపప్పు అందజేశారు. స్టీమ్డ్ రైస్ కేజీ రూ.49లు, ముడిరైస్ కేజీ రూ.48లు, కందిపప్పు కేజీ రూ.160లకే అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు. ఒక మనిషికి ఆధార్‌కార్డుపై ఐదు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఎస్.పద్మశ్రీ, ఆర్డీవో పి.సరోజిని, తహసీల్దార్ యం.హరిబాబు, మిల్లర్లు భాస్కరరావు, బ్రహ్మానందరావు, బ్రహ్మయ్య, గురుస్వామి, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

వేములూరిపాడు- కొండవీడు రోడ్డు పూర్తి చేయండి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి



జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న శివారెడ్డి

గుంటూరు వెస్ట్: చరిత్ర ప్రసిద్ధిగాంచిన కొండవీడు కోటను చేరుకునేందుకు అవసరమైన వేములూరిపాడు- కొండ వీడు రోడ్డును పూర్తి చేయాలని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ కోటను సందర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులు వస్తుంటారన్నారు. కోటకు ఫిరంగిపురం నుంచి ఇరుకు సందుల్లో వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. వేములూరిపాడు నుంచి కోటకు చేరుకునేందుకు ఆరు కిలోమీటర్ల రహదారిని గత ప్రభుత్వం నిర్మించతలపెట్టిందని తెలిపారు. అయితే మొత్తం పూర్తి చేసి.. కేవలం 170 మీటర్ల రోడ్డును వదిలేశారని చెప్పారు. అడ్డంకులు తొలగించి, రోడ్డును పూర్తి చేయాలని కోరారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి

ఎంపీడీవో కొర్రపాటి



సదస్సులో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం 16వ విడత గ్రామాల్లో నిర్వహించే సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీర్లు, ఉపాధి సిబ్బందితో గ్రామాల్లో నిర్వహించే సామాజిక తనిఖీలు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 1-4-2023 నుంచి 31-03-2024 వరకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక బృందం సభ్యులు చేసిన పనులు నిధులు వినియోగం, ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో ఆడిట్ చేస్తారన్నారు. ఇందుకుగాను 375 పనులకు రూ. 5 కోట్లు 84 లక్షల 22 వేలు నిధులు వెచ్చించినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందాలకు ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులు, ఉపాధి కూలీలు తప్పనిసరిగా తమ సహకారం అందించాలన్నారు. పింఛనుదారులు ఇళ్లవద్దకు వచ్చిన సమయంలో అందుబాటులో ఉండాలని లేని పక్షంలో డోర్ లాక్ అని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే పింఛనుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొని ఉంటుందన్నారు. పది రోజుల పాటు సామాజిక బృందాలు అన్నీ గ్రామాల్లో ఆడిట్ చేసిన తదుపరి మండల స్థాయిలో ప్రజావేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ రాజు, ఏపీవో రామారావు, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం



ఏపీ మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లులు అమ్మ పేరుతో వందలాది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవి నాయక్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన పర్యావరణ పరిరక్షించుకోవచ్చునని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. తల్లి పేరు మీద మొక్కలు నాటడం వల్ల తల్లిని గౌరవించినట్లు అవుతుందన్నారు. తద్వారా తల్లి నివసించడానికి కారణమైన భూమాతను గౌరవించినట్లు అవుతుందన్నారు. ప్రకృతిలో మొక్కలు ద్వారా పెరిగిన చెట్లలో అమ్మను చూసుకుంటామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో వందలాది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, పాఠశాల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్కౌట్స్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

నరసరావుపేట రూరల్: మండలంలోని కాకాని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిశెట్టి గోవిందరాజులు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ కేఎంఏ హుస్సేన్, ఎంఈవో ఎస్. నాగేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, స్కౌట్ మాస్టర్ టి.అంజిరెడ్డిలు పాల్గొని ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పాఠశాల నుంచి మొత్తం నలుగురు విద్యార్థులు నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించినట్టు తెలిపారు. స్కౌట్స్ విభాగంలో సోను యాదవ్, యోత్కూరి రంగారాయుడులు ఒంగోలు, శ్రీకాకుళంలో సీట్లు పొందినట్టు వివరించారు.

డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ నాతాని, అధ్యాపకులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు వర్సిటీ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థులు బీఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో పి.పద్మలీల 900 మార్కులకు గాను 873, ఎంపీసీఏస్‌లో కె.వెంకటలక్ష్మీ 872, ఎంసీఎస్‌ఎస్‌లో జి.శైలజ 836, ఎంఈసీఎస్‌లో వై.నాగలక్ష్మీ 830 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే ఎంబీసీఎస్‌లో 1000 మార్కులకు గాను షేక్.మున్నీ 964, బిజడ్‌సీలో ఎం.సౌజన్య 921 మార్కులు, బికాం కంప్యూటర్స్‌లో 800 మార్కులకు గాను బి.జ్యోతి 734 మార్కులు సాధించారని వివరించారు. వర్సిటీ స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ నాతాని, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, అధ్యాపకులు సయ్యద్ సర్దార్ జానీహుస్సేన్, జె.మల్లారెడ్డి తదితరులు అభినందించారు.

సమావేశాలకు ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవు

– ఎంపీపీ పిడతల ఝాన్సీ



యద్దపాడు: ప్రజా సమస్యల పరిష్కారం.. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిని సహించేది లేదంటూ ఎంపీపీ పిడతల ఝాన్సీ పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తొలి సమావేశం కావడంతో సీఎం చంద్రబాబు, నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపి సభను ప్రారంభించారు. యద్లపాడు ఎంపీటీసీ కీర్తి అరుణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, కోట సర్పంచ్ హాఫీజ్‌బేగ్, కోఆప్షన్ సభ్యులు గౌస్‌సందాని, ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, తహసీల్దార్ మొహ మ్మద్ అఫ్రిపున్నిసాబేగం, వివిధ విభాగాల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట: పట్టణంతో పాటు మండలంలోని అన్నీ గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3గంటలవరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై.ఏడుకొండలు శుక్రవారం చెప్పారు. జొన్నలగడ్డ సబ్‌స్టేషన్ మరమ్మతులతో పాటు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా ఈ విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, బుచ్చిపాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం, మర్రిచెట్టుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఇ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్లలోగల 220/132/133 కె.వి.సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. 3-ఫేస్ విద్యుత్ శనివారం తెల్లవారుజామున 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఇవ్వటం జరుగుతుందన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మద్దినగర్, రహమత్ నగర్, జాగుపాలెం, బొందిలిపాలెం, గవర్నమెంట్ ఆసుపత్రి రోడ్డు, సుగాలికాలనీ, సాంబశివనగర్, పండరీపురంలోని 9,10 లైన్లలో విద్యుత్ సరఫరా సంబంధిత వేళల్లో ఉండదన్నారు. అలాగే చిలకలూరిపేట మండలం మురికిపూడి, యడవల్లి, కట్టుబడివారిపాలెం, మద్దిరాల, పసుమర్రు, పోతవరం, యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెం, సొలస, కొండవీడు, పుట్టకోట, యడ్లపాడు, వంకాయలపాడులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో తనిఖీ



శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల, పిచికలపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో మద్దికుంట సాంబశివరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడానికి బడిలో చేరకుండా బయట తిరుగుతున్న బడిఈడు పిల్లలను గుర్తించి చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించేలా తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు వంటకాలు రుచి పరిశీలించారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు దిశ నిర్దేశం చేశారు. ఆయనతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యం.శ్రీనివాసరావు, మల్లిఖార్జున రావు ఉపాధ్యాయులు ఉన్నారు.

పేటలో ఆరంభమైన కనకమహాలక్ష్మి బ్యాంకు సేవలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట: కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు శాఖ పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ రోడ్డులో ప్రారంభమైంది. శుక్రవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథులుగా పాల్గొని బ్యాంకు శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా వ్యాపారులకు, ప్రజలకు సహకార బ్యాంకుల అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ క్రమంలో కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు శాఖను ఈ ప్రాంతంలో ప్రారంభించటం శుభ పరిణామమన్నారు. గడిచిన 25 సంవత్సరాలుగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటంలో బ్యాంకు తనదైన శైలీ ప్రదర్శిస్తోందన్నారు. ఈ ప్రాంత ఖాతాదారులు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంకు ఇటీవలే 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు నిర్వహించుకుందని, ఈ క్రమంలోనే 30వ శాఖను చిలకలూరిపేటలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ గోలి రామకృష్ణ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.శ్యామ్‌కిషోర్, శాఖ మేనేజర్ బాలకృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులు ఉల్లంఘిస్తే కేసు నమోదు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



పొట్లూరులో కోడిగుడ్లు సైజు పరిశీలిస్తున్న పద్మావతి

శావల్యాపురం: బాలల హక్కులను ఉల్లంఘిస్తే సుమోటోగా కేసు నమోదు చేసి సత్వరమే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పొట్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటరుతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, బడి బయట పిల్లలు ఉండటం, బాలల బిక్షాటన తదితరవన్నీ పూర్తిస్థాయిలో నియంత్రణ చేయడానికి ప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపట్టిందన్నారు. బాలల సంరక్షణ కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారు. 2030 నాటికి సుస్థిర ఆర్థిక లక్ష్యాలను అధిగమించడానికి విద్య ద్వారానే సాధ్యమౌతుందన్నారు. ముఖ్యంగా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని తప్పనిసరిగా బడిలో చేర్పించేలా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేసి సమన్వయంతో వ్యవరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల్లో వసతులు వంటకాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితరవన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తించి వాటిని పునరావృతం కాకుండా సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నీ పాఠశాలల్లో తప్పనిసరిగా ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటరు సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అలాగే చిన్నారులతో మాట్లాడి కార్యకర్తలు నేర్పుతున్న ఆటలు-పాటలు, విద్య కోడిగుడ్లు సైజును అన్నింటినీ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు వంటకాలు రుచిని స్వయంగా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు ఉమారాణి, వినుకొండ క్లస్టర్ సీడీపీవో ముదివర్తి అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణా, తమ్మిశెట్టి విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

శాంతినగర్‌లో నూతన చర్చి ప్రారంభోత్సవం



చర్చిని ప్రారంభిస్తున్న ఫాస్టర్ షద్రక్, గోను శ్రీనివాసరావు

నాదెండ్ల: నీ వలె నీ తోటి వారిని ప్రేమించు అన్న ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని హైదరాబాద్‌కు చెందిన ఫాస్టర్ జె షద్రక్ చెప్పారు. గణపవరం శాంతినగర్‌లోని షిలోహు క్రైస్తవ ప్రార్థనామందిరం రూ.25 లక్షలతో పునర్ నిర్మించారు. శుక్రవారం మందిర ప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రపంచ శాంతి, సోదర భావం కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్థానికులతో పాటూ ఇతర గ్రామాల నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కందుకూరుకు చెందిన డి.ఎఫ్రా, ఒంగోలుకు చెందిన ఎస్ ప్రభాకరరావు ప్రసంగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను స్థానిక ఫాస్టర్ గోను శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



ఏసుదాసు మృతదేహం

నాదెండ్ల: విద్యుదాఘాతానికి గురై రెండంతస్తుల డాబాపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాతులూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేరకు అప్పాపురం ఎస్సీ కాలనీకి చెందిన చెరుకూరి శ్రీహర్ష అలియాస్ ఏసుదాసు (22) నూతన గృహాలకు ఎలివేషన్ అద్దాలు బిగించే పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో నాదెండ్ల గ్రామానికి చెందిన మేస్త్రి వద్ద పని చేస్తూ కొంత కాలంగా సాతులూరులో నూతనంగా నిర్మించిన ఓ గృహానికి రెండో అంతస్తులో అద్దాలు బిగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పనులు ప్రారంభించిన కొద్దిసేపటికీ విద్యుదాఘాతానికి గురై డాబాపై నుంచి కిందపడ్డాడు. దీంతో స్థానికులు శ్రీహర్షను హుటాహుటిన నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే ప్రమాదం జరిగిన డాబా వద్ద సరైన ఏర్పాట్లు లేని కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు తోటి కార్మికులు వాపోయారు. మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి గతంలోనే మృతి చెందగా, తల్లి లక్ష్మీ, సోదరుడు మార్కుతో కలిసి జీవిస్తున్నాడు. మృతుడు అవివాహితుడు.

రోటరీ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

చిలకలూరిపేట: రోటరీ క్లబ్ సేవకు ప్రతిరూపమని రోటరీ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు కొనియాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట మాజీ అధ్యక్షుడు కాపు వెంకటరావు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చిలకలూరిపేట నుంచి రోటరీ జిల్లా గవర్నర్లుగా వ్యవహరించిన వారికి చిలకలూరిపేట క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరించిన వారికి పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో ఘనంగా సన్మానించారు. వారివారి కాలంలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్లు డాక్టర్ చిలుకూరి శ్రీరామమూర్తి, జాష్టి రంగారావు, అన్నె రత్నప్రభాకర్, క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల అంజిరెడ్డి, తోటకూర వెంకట నారాయణ, కందిమళ్ల సాంబశివరావు, ఈదర గిరీష్‌బాబు, కందిమళ్ల అంజిబాబు, గళ్లా సాంబశివరావు, పఠాన్ ముక్తార్ అహమ్మద్, వేమ నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలి

చిలకలూరిపేట: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని వేలూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మేకల కిషోర్ చెప్పారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని తన్నీరు జనని పదో తరగతిలో ఉన్నత ఫలితాలు సాధించటంతో పాటు ఇటీవల ప్రకటించిన ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్‌లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థిని జనని ఎంతో క్రమశిక్షణతో విద్యను అభ్యసించటంతో పాటు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిందని కొనియాడారు. ఈ విద్యార్థినిని ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.